క్లుప్తంగా

మాచర్ల రూరల్ సీఐగా సురేష్



మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సురేష్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో ఎస్‌ఐగా పని చేస్తూ ఇటీవల పదోన్నతిపై సీఐగా నియమితులయ్యారు. ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు రూరల్, విజయపురిసౌత్, వెల్దుర్తి ఎస్‌ఐలు టి.రాజశేఖర్, కొండారెడ్డి, శ్రీహరిలు అభినందనలు తెలిపారు.

దుర్గిలో నేడు ఆసరా చెక్కుల పంపిణీ

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల పరిధిలోని డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నాలుగవ విడత చెక్కులను పంపిణీ చేయనున్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందజేయడమే లక్ష్యం



దుర్గి: అవ్వాతాతలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్లను క్లస్టర్ పరిధిలో పూర్తిగా ప్రతి ఒక్క లబ్ధిదారుకు అందజేయడమే లక్ష్యంగా వలంటీర్లు సేవలు అందజేస్తున్నారు. మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన కొండసాని రాజమ్మ నడుము నొప్పి బాధతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ దేశం సాంబిరెడ్డి తన క్లస్టర్ పరిధిలో పూర్తిస్థాయిలో పెన్షన్లను అందజేయాలని లబ్ధిదారు ఆచూకీ తెలుసుకొని హైదరాబాదులో ఆమెకు పెన్షన్ అందజేశాడు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో తమ వద్దకు వచ్చి పెన్షన్ అందజేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. వలంటీర్ సేవలకు లబ్ధిదారుతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తోటి వారి పట్ల కరుణ కలిగి ఉండాలి



విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులకు సందేశం అందించారు. అందరూ దైవం పట్ల విశ్వాసంతో తోటి మానవుల పట్ల కరుణతో జీవించాలన్నారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని అన్నారు. భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి సాగర్‌మాతకు కొబ్బరికాయలు కొట్టి తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ అక్కమ్మ మృతి బాధాకరం



కారెంపూడి: వైస్ ఎంపీపీ కోకా అక్కమ్మ మృతి బాధాకరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కారెంపూడి వైస్ ఎంపీపీ కోకా అక్కమ్మ (65) శనివారం మృతి చెందారు. అక్కమ్మ వేపకంపల్లి గ్రామ వైఎస్సార్ ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు వైస్ ఎంపీపీగా ప్రభుత్వ విప్ పీఆర్కే అవకాశం కల్పించారు. శనివారం వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ సభ జరుగుతున్న సమయంలోనే అక్కమ్మ మరణ వార్తను తెలుసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. తర్వాత ఆయన స్వయంగా వేపకంపల్లి వెళ్లి అక్కమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆమె కుమారులు శ్రీను, రామయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ షఫీ, పార్టీ నాయకులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, తేజానాయక్, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, పంగులూరి రామకృష్ణయ్య, యర్రంరెడ్డి వీరారెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, బొమ్మిన హనుమయ్య తదితరులు ఆయన వెంట వెళ్లి అక్కమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

అక్క చెల్లెమ్మలకు జగనన్న ఆసరా



శ్రీనగర్‌లో వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : డ్వాక్రా అక్క చెల్లెమ్మలను మోసం చేసిన జిత్తులమారి చంద్రబాబుని నమ్మవద్దని, ఇచ్చిన మాటమీద నిలబడి డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు చేదోడుగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్, పొందుగల, రామాపురం గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఆదివారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2014లో డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ చేస్తానని చంద్రబాబు మాయమాటలు చెప్పి స్వల్ప తేడాతో అధికారంలోకి వచ్చారని, ఐదేళ్లు సీఎంగా ఉన్నా ఒక్క రూపాయి కూడా డ్వాక్రా సంఘాలకు మాఫీ చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఇప్పటికి నాలుగు దఫాలుగా వైఎస్సార్ ఆసరా ద్వారా వడ్డీలను అక్క చెల్లెమ్మలకు చెల్లించారని ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలు అన్ని విధాలుగా రాణిస్తూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని, డ్వాక్రా మహిళలు స్వశక్తితో పురుషులతో సమానంగా బతికేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, కానీ చంద్రబాబు మాత్రం వలంటీర్ వ్యవస్థను తీసేస్తానని బహిరంగంగా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగబోతున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటిలో జరిగిన మేలు గుర్తుకు తెచ్చుకుని ఓటు వేయాలని, మళ్లీ మీరు కోరుకున్న పాలన కొనసాగే విధంగా ఓటు ద్వారా ఆమోదం తెలపాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, సర్పంచ్‌లు కూసం నాగిరెడ్డి, షేక్ ఇమామ్‌వలి, గుర్రం సైదయ్య, ఎంపీటీసీలు ఆకూరి కాశీరెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి మాశెట్టి బుజ్జి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి, మాజీ ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి సైదారెడ్డి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



వైఎస్సార్‌సీపీలో చేరిన కంభంపాడు గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావుతో ప్రభుత్వ విప్ పీఆర్కే

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98% అమలు పరచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలిపేలా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన మెచ్చి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తొగటి సంఘం నేత పాత శ్రీనివాసరావు టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు పీఆర్కే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కేటాయిస్తూ బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ అని నిరూపిస్తున్న నేత సీఎం జగన్ అని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆరికట్ల చంద్రారెడ్డి, తాతా సత్యనారాయణ, కాలా నరసింహారావు, శీలం నరసింహారావు తదితరులున్నారు.

అభివృద్ధిని చూసి అండగా ఉండండి

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



శ్రీనగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : చరిత్రలో నిలిచేలా అభివృద్ధి చేశామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలతో నిర్మించిన పైపులైన్లను ప్రారంభించి కుళాయి ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎమ్మెల్యేగా నన్ను, సీఎంగా జగనన్నను గెలిపించారని, ప్రజల ఆశీర్వాదం ద్వారా వచ్చిన ఈ పదవులతో అభివృద్ధి పనులు చేసి రుణం తీర్చుకుంటున్నామని చెప్పారు. టీడీపీ వాళ్లు అభివృద్ధి చేశామని చెప్పటానికి ఒక్కటి కూడా నియోజకవర్గంలో లేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భారీగా నిధులు తీసుకువచ్చి అవకాశం ఉన్నంత వరకు అభివృద్ధి చేసి చూపించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చింది అధికారాన్ని అనుభవించటానికి కాదని, ప్రజలకు సేవ చేసేందుకు మాత్రమేనన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.500కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను తెప్పించామని, పిడుగురాళ్లలో ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు, అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేలో బైపాస్ రోడ్డు పనులు చేయించామని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో మేము చేసిన సంక్షేమం, అభివృద్ధితోనే ప్రజల వద్దకు వెళ్తామని, తప్పనిసరిగా ప్రజల ఆశీర్వాదం మాకు ఉంటుందని అన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, సొసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి, ఉపసర్పంచ్ కాటుపల్లి శ్రీకాంత్, నాయకులు వణుకూరి శంకర్‌రెడ్డి, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిన్న కోటయ్య, పులిపాంగు సైదులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి ద్రోహం చేస్తే సహించం

కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేస్తే సహించమని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి హెచ్చరించారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గతంలో ఎప్పుడు ఇవ్వనన్ని ఉన్నతమైన పదవులు తాము ఇచ్చామని, పదవులు తీసుకున్న నాయకులు పార్టీ అభివృద్ధికి పాటు పడకుండా నష్టం చేసే పనులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. పార్టీ గుర్తుతో గెలిచి పార్టీకి నష్టం చేసే పనులు చేస్తే తనదైన రీతిలో మందలించానని, పార్టీలో ఉండటం ఇష్టం లేకపోతే పార్టీకి, పదవికి రాజీనామా చేసి వెళ్లవచ్చునని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసిన వ్యక్తి ఎస్సీనా..ఎస్టీనా..బీసీనా, ఓసీనా..మైనార్టీనా..అని చూడనని, ఆఖరికి తన వలన పార్టీకి నష్టం జరిగితే చర్యలు తీసుకునే అధికారం అధ్యక్షులవారికి ఉంటుందన్నారు. కార్యకర్తల రెక్కల కష్టంతో గెలిచి పార్టీకి ద్రోహం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సాధారణ వ్యక్తులను పోటీలో నిలబెట్టి గెలిపించే దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా సామాన్యుడైన అనిల్‌కుమార్ యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. గామాలపాడులో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, సర్పంచ్ జంగా సురేష్‌కి సమాచారం ఇచ్చి నిర్వహిస్తామని తెలిపారు. తనకు ఎటువంటి భేషజాలు లేవని, అందరిని కలుపుకుని ముందుకెళ్తానని చెప్పారు. గతంలో కంటే హెచ్చు మెజార్టీతో గెలవటం తథ్యమన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా కుల గణన సర్వే

- గురజాల సబ్ డివిజన్ పరిధిలో మొదటి స్థానంలో దుర్గి, చివరి స్థానంలో మాచవరం
- 161 సచివాలయాల పరిధిలో 2,18,419 కుటుంబాల సర్వే
- వేగంగా కులగణన నిర్వహిస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



పిడుగురాళ్ల పట్టణంలో కులగణన సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

పిడుగురాళ్ల: శతాబ్ద కాలంగా కులగణన సర్వే జరగకపోవటంతో అట్టడుగు బలహీన వర్గాల ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాల్లో కోత పడుతుంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హత ఉన్న బలహీన వర్గాల ప్రజలకు చేరాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే గురజాల డివిజన్‌లో శరవేగంగా జరుగుతుంది. సర్వే పూర్తి అయితే అర్హత ఉన్న పేద ప్రజలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనున్నాయి. కులగణనను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు శరవేగంగా నిర్వహిస్తున్నారు. సచివాలయ స్థాయిలో కులగణన సర్వేతో అన్ని కులాల జనాభా లెక్కలు పక్కాగా నిర్ధారణ కాబోతున్నాయి. సచివాలయ పరిధిలోని ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలతోపాటు కులం, మతం, వృత్తి, విద్యార్హత, ఉద్యోగ తదితర వివరాలు వలంటీర్లు నమోదు చేస్తున్నారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో 161 సచివాలయాల పరిధిలో 3,437 క్లస్టర్లుగా విభజించి 2,18,419 కుటుంబాలకు చెందిన 6,26,451 మంది వివరాలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటికి తిరిగి నమోదు చేశారు. ఈ రెండు నియోజకవార్గల్లో ఇప్పటి వరకు అత్యధికంగా 91.40 శాతం సర్వే దుర్గి మండలంలో జరగ్గా, అత్యల్పంగా 83.96 శాతం మాచవరం మండలంలో జరిగింది. మొత్తం మీద కులగణన సర్వే కార్యక్రమం గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో శరవేగంగా జరుగుతుంది. మరో వారంలోగా సర్వే పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వేగంగా కుల గణన నిర్వహిస్తున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కులగణన కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ కుటుంబ సభ్యుల వివరాలు, వృత్తి, ఆదాయం, కులం, మతం వంటి వివరాలతో సహా కులగణన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయింది. మరికొన్ని రోజుల్లోనే పూర్తిస్థాయిలో కులగణన సర్వేను పూర్తి చేస్తాం.

– టీఎస్ గిరికుమార్, మున్సిపల్ కమిషనర్, పిడుగురాళ్ల

మహిళా వైద్యులకు సత్కారం



మహిళా వైద్యురాలు డాక్టర్ గిరిజకు సత్కారం

సత్తెనపల్లి: వైద్యులు దైవ సమానులు అని సత్తెనపల్లి ప్రైవేట్ హస్పిటల్స్ కాంపౌడర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎం.రఫీ అన్నారు. జాతీయ మహిళా డాక్టర్ల దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరుగురు మహిళా డాక్టర్లను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ఎన్నో రుగ్మతలతో వచ్చే రోగులను కాపాడే వైద్యులు దైవంతో సమానమన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు మాట్లడుతూ కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ అన్ని వేళల్లో రోగుల కోసం పని చేస్తున్న మహిళా డాక్టర్లు అభినందనీయులన్నారు. గ్రామీణ ప్రాంత రోగులకు సేవలందించటంలో సత్తెనపల్లి మహిళా వైద్యులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సీనియర్ వైద్యులు అయిన డాక్టర్ జి.గిరిజ, డాక్టర్ పొట్ల అరుణకుమారి, డాక్టర్ షకీలా శ్రీధర్, డాక్టర్ ఫణి ప్రశాంతి, డాక్టర్ గీతా హసంతీ, డాక్టర్ ఈటరాజశ్రీలను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు వలి, శ్రీనివాస్, ఏసు, రంజిత, ప్రసన్న తది తరులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో ప్రతిభ



సత్తెనపల్లి: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి కరకట్ట ఉండవల్లి సమీపంలోని లైలాగంగరాజు నగర్ లో ఆదివారం నిర్వహించిన 24వ కృష్ణ రివర్ క్రాస్ ఈత పోటీల్లో సత్తెనపల్లికి చెందిన నిమ్మగడ్డ హనుమంతురావు ప్రతిభ కనబరిచారు. 61 సంవత్సరాల విభాగంలో 1.5 కిలో మీటర్ల ఈత పోటీల్లో 48 మంది పోటీపడగా సత్తెనపల్లికి చెందిన హనుమంతరావు ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే 40నుంచి50 సంవత్సరాల విభాగంలో 1.5 కిలోమీటర్లు నిర్వహించిన ఈత పోటీల్లో 86 మంది పాల్గొనగా సత్తెనపల్లికి చెందిన షేక్ మహమ్మద్ గని, డాక్టర్ జి శ్రీధర్, షేక్ మహబూబ్ సైదాలు నిర్ణీత సమయానికి చేరుకొని ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్స్, మెడల్స్ అందుకున్నారు. ఈత పోటీల్లో ప్రతిభ చూపిన వారిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

కనపర్రు సేవా సమితి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు

నాదెండ్ల: కావూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, రక్తపరీక్షల నమూనాలు సేకరించారు. ఉచితంగా మందులు అందించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆదివారం కనపర్రు గ్రామానికి చెందిన కనపర్రు సేవా సమితి ఆధ్వర్యంలో విష జ్వరాలు అరికట్టేందుకు యువత సేవా కార్యక్రమాలు నిర్వహించింది.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

పది కిలోల గంజాయి స్వాధీనం

నాదెండ్ల: శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి కథనం.. గణపవరం చవిటిపాలెం వెళ్లే డొంక రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై పది కిలోల గంజాయి తరలిస్తుండగా ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరు ఖైరతాబాద్ చింతలబస్తీకి చెందిన కడం ఉల్లాస్, ఒడిషా రాష్ట్రానికి చెందిన గౌలరి శంకర్, విశాఖ జిల్లా సీలేరుకు చెందిన రెడ్డి గుణశేఖర్‌గా గుర్తించారు. గత నెల 31వ తేదీన చింతలపుట్టి శివకుమార్, కె.శంకర్ రెండు ద్విచక్రవాహనాలపై గంజాయిని తరలిస్తూ తిమ్మాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి పోలీసులకు చిక్కారు. ఇద్దరి వద్ద నుంచి 107.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఇరువురు నిందితుల సమాచారం ఆధారంగా తనిఖీ నిర్వహించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన వారిలో యడ్లపాడు ఎస్‌ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ రవికృష్ణ, ఏఎస్‌ఐ రోశిబాబు, నాదెండ్ల డీటీ అనూరాధ, ఆర్‌ఐ రమీజా, వీఆర్వో వీరయ్య ఉన్నారు.

రెండో పీహెచ్‌సీకి అనుమతులు

అచ్చంపేట: మండలంలో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ నుంచి అనుమతులు వెలువడినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు.

విస్తీర్ణ పరంగా పెద్ద మండలం కావడంతో... 23 గ్రామ పంచాయతీలకు వైద్య సేవలను అచ్చంపేట పీహెచ్‌సీ ద్వారా అందించడం కష్టంగా ఉండటంతో.. రెండో పీహెచ్‌సీకి ప్రతిపాదనలు పంపారు. మండలంలోని చిట్టచివరి గ్రామమైన మాదిపాడులో నిర్మించేందుకు ఉత్తర్వులు అందాయి. అయితే.. చింతపల్లిలో పీహెచ్‌సీ నిర్మిస్తే తాళ్లచెరువు నుంచి కొత్తపల్లి, చెరుకుంపాలెం, చింతపల్లి, పుట్లగూడెం, తాడువాయి, చల్లగరిగ, గింజుపల్లి, కుంటిమద్ది, మాదిపాడుతోపాటు మరో మూడు గిరిజన తండాల ప్రజలకు వైద్య సేవలు విస్తరించవచ్చని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఉన్నతాధికారులకు సూచించారు. దీంతో అధికారులు స్పందించి చింతపల్లిలో పీహెచ్‌సీని నిర్మించేందుకు అనుమతులు జారీచేశారు. పీహెచ్‌సీ భవన నిర్మాణానికి అవసరమైన రెండెకరాల స్థలాన్ని మండల రెవెన్యూ అధికారులు సేకరించారని, త్వరలో భవన నిర్మాణాన్ని చేపడతామని ఎమ్మెల్యే కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.

చేజర్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

నకరికల్లు : చేజర్ల గ్రామంలో ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజన్ సెంటర్ కో–ఆర్డినేటర్ బత్తుల మల్లేష్ మాట్లాడుతూ శిబిరంలో 108 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడంతో పాటు కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆర్‌ఎంపీ వైద్యులు రాజేంద్ర ప్రసాద్, మాణిక్యారావు, టెక్నీషియన్‌లు శ్యామ్, సిద్ధార్థ, బాలకృష్ణ, రత్నాకర్, హరీష్ బాబు, దూళిపాళ్ల హాస్పిటల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలు చేస్తే కఠిన చర్యలు



సత్తెనపల్లి: తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు హెచ్చరించారు. పట్టణంలోని పలు చికెన్, మటన్, చేపల దుకాణాల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగిస్తూ కేజీకి 100 గ్రాముల నుంచి 250 గ్రాములు తక్కువ తూయడాన్ని గమనించారు. మొత్తం 10 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఇకపై ఎలాంటి మోసాలు చేసినా.. చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు ఒకటికి రెండు సార్లు చూసుకొని కాటాలను గమనించాలన్నారు. ఆయనతోపాటు సిబ్బంది ఉన్నారు.

'స్నేహ హస్తాలు' ఆర్థిక సాయం

అచ్చంపేట: పెదపాలెం గ్రామానికి చెందిన దంతాల నాగరాజుక పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. దీంతో స్నేహ హస్తాలు సంస్థ సభ్యులు స్పందించి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.75వేలు విలువచేసే ఇటుకలు, ఇనుము, సిమెంట్, సిమెంట్ పోల్స్ తదితర సామగ్రిని ఆదివారం బాధితుడికి అందించారు. గ్రామ పెద్దల సమక్షంలో శంకుస్థాపన చేయించారు. కుటుంబ నిత్యావసరాలకు మరో రూ.25వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మన్నెం భద్రయ్య, సంస్థ కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా, గ్రామ మాజీ సర్పంచ్ నెల్లూరి వెంకటయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ చిరుమామిళ్ల నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు



అచ్చంపేట: ట్రాక్టరు బైక్‌ను ఢీకొట్టడంతో విద్యార్థులకు తీవ్ర గాయాలైన ఘటన సంద్రతండా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మేడికొండూరుకు సమీపంలోని కేసీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చదవుతున్న రాజశేఖర్ మరో ఇద్దరు విద్యార్థులు బైకుపై పులిచింతల ప్రాజెక్టును సందర్శించేందుకు వేగంగా వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారిని ఢీకొట్టగా విద్యార్థులు కింద పడిపోయారు. బైకు ట్రాక్టరు క్రిందకు దూసుకుపోయింది. తీవ్ర గాయపడిన విద్యార్థులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాజశేఖర్ ఎడమకాలు తీవ్రంగా గాయం కాగా మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

ఇద్దరు యువకులపై మూకుమ్మడి దాడి



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఇద్దరు యువకులపై కొందరు యువకులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్‌ఐ కె.వెంకట నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ రహదారిలో నున్న మీ సేవా కేంద్రంలో గ్రామానికి చెందిన వడ్లపల్లి విజయభాస్కర్‌రెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి పనిచేసుకుంటున్న సమయంలో రెంటాల గ్రామానికి చెందిన ఏడుగురితో పాటు మరికొందరు యువకులు మూకుమ్మడిగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చినట్లు తెలిపారు. గాయపడిన ఇద్దరిని గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఈ నెల 2న జరిగిన తిరునాళ్ల వేడుకలలో పార్టీ జెండాలు తీసుకురాకూడదని చెప్పినందుకు ఈ దాడి జరిగినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.